సమాచారం

ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనం మరమ్మతులకు రూ.2.75 కోట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని చారిత్రక ఆర్ట్స్ కాలేజీ భవనం మరమ్మతులకు వర్సిటీ అధికారులు రూ.2.75 కోట్ల నిధులను మంజూరు చేశారు. నిజాం నవాబులు నిర్మించిన అందాల ఆర్ట్స్ కాలేజీ భవనం మరమ్మతులకు ఓయూ దూరవిద్య కేంద్రం నుంచి నిధులను సమీకరించారు. మరమ్మతు పనులను టీఎస్‌సీబ్ల్యూఐసీడీ సంస్థకు అప్పగించారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి



జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రహదారుల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే నాలాల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను సత్వరమే చేపట్టాలని కోరారు.

మాతాజీనగర్‌లో అధికారుల సర్వే

రాంగోపాల్‌పేట్: బేగంపేటలోని మాతాజీనగర్‌లో ఫ్రైడ్ ఇండియాకు చెందిన 10 ఎకరాల వెంచర్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సంస్థ ఎఫ్‌టీఎల్‌కు చెందిన స్థలంలో వెంచర్ వేసి ప్లాట్లుగా విభజించి వందల మందికి విక్రయించింది. అయితే ఇక్కడ ప్లాట్లు కొన్న కొంత మంది జీహెచ్ఎంసీ నుంచి ఎఫ్‌టీఎల్ పేరిట అభ్యంతరాలు రావడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందో రాదో పరిశీలించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ ఈఈ శంకర్‌రావు నేతృత్వంలో అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి

కంటోన్మెంట్: టీడీపీకి కంచుకోట అయిన కంటోన్మెంట్‌లో పార్టీకి పూర్వవైభవం తెస్తామని ఆ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గడ్డి పద్మావతి అన్నారు. శుక్రవారం మోండా డివిజన్ అంబేద్కర్ నగర్‌లో స్థానిక నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కంటోన్మెంట్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలోనే ఇంటింటికీ బొట్టు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థుల గెలుపు కోసం తాము కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు టీఎస్ నరహరి, అంజయ్య ముదిరాజ్, డీఆర్ శ్రీనివాస్, జైరాజ్ ముదిరాజ్, ఎస్‌కే బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన


ట్రాఫిక్ నియమాలపై మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

లాలాపేట: బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం తార్నాకలోని శ్రీరాం ఫైనాన్స్ ఉద్యోగులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు ప్రొజెక్టర్ ద్వారా డ్రంకన్ డ్రైవ్‌తో కలిగే నష్టాలు, ట్రాఫిక్ నియమాలను వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఇండో ఆస్ట్రేలియా బృందం

రసూల్‌పురా: రక్షణ మంత్రిత్వ శాఖ రూపొందించిన జాయింట్ ట్రైనింగ్ అండ్ ఓరియంటేషన్ ఆఫ్ యంగ్ ఆఫీసర్స్ కార్యక్రమంలో భాగంగా ఇండియా, ఆస్ట్రేలియా సంయుక్త ప్రతినిధి బృందం దుండిగల్ ఎయిర్ ఫోర్స్ ఆకాడమిని సందర్శించింది. ఈ బృందంలో 15మంది భారతీయులు, 15 మంది ఆస్ట్రేలియన్లు ఉన్నారు. రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక వృత్తిపరమైన సామాజిక సంబంధాలను పెంపొందించడానికి 2021లో రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ ట్రైనింగ్ అండ్ ఓరియంటేషన్ ఆఫ్ యంగ్ ఆఫీసర్స్ ఇండియా అండ్ ఆస్ట్రేలియా కార్యక్రమం రూపొందించారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలుచోట్ల ధర్నా


బేగంపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

రాంగోపాల్‌పేట్: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు కలిసి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బన్సీలాల్‌పేట్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని వేర్వేరు చోట్ల బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, నాయకులు ప్రేమ్, అబ్బాస్, ఫయూమ్ తదితరులు పాల్గొన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను కేంద్ర తగ్గించాలని లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పేదలను ఇబ్బంది పెడుతోందని నాయకులు ఆరోపించారు.

పద్మారావునగర్ : వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పద్మారావునగర్ పార్కు ముందు ఆందోళన చేపట్టారు. పార్కు ముందు షామియానా ఏర్పాటు చేసిన వంట గ్యాస్ ధరలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మారావునగర్ ఇన్‌ఛార్జి పవన్‌కుమార్ గౌడ్, నాయకులు ఎల్ వెంకటేషన్, ముక్కా శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వంట గ్యాస్ ధరల పెంపు ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డివిడిచిందన్నారు. వంట గ్యాస్ ధరలు అన్ని వర్గాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు.

అమీర్‌పేట : ధరలను నియంత్రించడంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విఫలమైందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి విమర్శించారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం డివిజన్‌లో నిసరన చేపట్టారు. వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజ ల ఉసురు పోసుకుంటున్న బీజేపీ నేతలు తెలంగాణా లో అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని విమర్శించారు. సత్యం థియేటర్ వద్ద జరిగిననిరసనలో హనుమంత్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.

బేగంపేటలో..

గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గ టీడీపీ నాయకులు బేగంపేటలో ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఆధ్వర్యంలో కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన వ్యక్తం చేశారు.

పద్మారావునగర్: బీఆర్ఎస్ నాయకులు సికింద్రాబాద్ సిటీలైట్ హోటల్ చౌరస్తాలో వంటావార్పు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ.. పేదల ఉసురు పోసుకుంటోంది

కంటోన్మెంట్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఉసురు పోసుకుంటోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కంటోన్మెంట్ బీఆర్ఎస్ నేతలు జూబ్లీ బస్ స్టేషన్ వద్ద నిర్వహించిన నిరసనలో పాల్గొన్నారు. కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసర తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లో జరిగిన నిసరన కార్యక్రమంలో కార్పొరేటర్


కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

పార్టీ ఎదుగుదలకు కార్యాలయం పునాదిగా ఉండాలి

కవాడిగూడ: పార్టీ కార్యాలయాల అభివృద్ధి ఎదుగుదలకు పునాదిగా ఉండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ ఇంద్రానగర్‌లో పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రాలుగా నిలవాలని సమస్య ఉన్న ప్రతి పౌరుడు కార్యాలయానికి వచ్చి చెప్పుకునే అవకాశం కల్పించాలన్నారు. విన్న సమస్యను తక్షణమే పరిష్కరించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కలుషిత తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలతో అనేక ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భోలక్‌పూర్ ప్రజల కోసం రాజకీయాలకు అతీతంగా కోట్లాది రూపాయలు కేటాయించి కలుషిత మంచినీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కోసం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ.. పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, నాయకులు రహీం, ఎండీ షరీఫ్, మహమూద్ అలీ, ఉమాకాంత్, శంకర్‌గౌడ్, మునువర్‌చాంద్, జబ్బర్, దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, మహేష్, రాములు, దినేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

‘పుట్టిన బిడ్డపై రూ. 1.52 లక్షల అప్పు భారం’

కవాడిగూడ: రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డపై రూ.1.52 లక్షల అప్పు భారం పడిందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లో కొత్తబజార్, ఉన్నికోట తదితర ప్రాంతాల్లో ‘హాత్ సే హాత్ జోడో ’లో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రంలో 8 వేల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధనిక రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందని ధరణి పేరుతో రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎటు చూసినా రోడ్లు, కలుషిత తాగునీరు, డ్రైనేజీ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, ఆర్.కల్పనాయాదవ్, కృష్ణ, నాయకులు శ్రీరాములుయాదగిరి, రమేష్‌యాదవ్, పాశం అనిల్‌కుమార్, బాబురావు, మహేష్, భాస్కర్ తదితరులున్నారు.


కవాడిగూడలో కరపత్రాలు అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

నూతన కమిటీ ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ గెజిటెడ్ ఆఫీసర్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కమిటీ శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ప్రొ.మంగు, గౌరవ కార్యదర్శిగా ప్రొ.వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ప్రొ.శైలజ, సహాయ కార్యదర్శిగా ప్రొ.మేడి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: లాడ్జిలోని డార్మిటరీలో పడుకున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. విశాఖ పట్టణం ఎన్‌జీవో కాలనీకి చెందిన వరప్రసాద్(62) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. తరచుగా నగరానికి వచ్చే ఆయన 31 బస్టాప్ ప్రాంతంలోని బాబా లాడ్జిలో బస చేస్తుంటారు. ఈ నెల 2వ తేదీన రాత్రి బాబా లాడ్జిలోని డార్మిటరీలో బస చేశారు. శుక్రవారం ఉదయం బెడ్‌పై నిర్జీవంగా పడి ఉండటాన్ని గమనించిన కస్టమర్లు ఈ విషయాన్ని లాడ్జీ సిబ్బందికి తెలియచేశారు. వారు పరిశీలించగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మార్కెట్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. గుండె పోటుతో మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

రుణం ఇప్పిస్తానంటూ రూ.5 లక్షలు మోసం

కంటోన్మెంట్: తన వద్ద పనిచేసే డ్రైవర్‌నే బురిడీ కొట్టించి రూ.5 లక్షలు కాజేశాడో ఓ ఘనుడు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన మేరకు.. హస్మత్ పేటకు చెందిన రాకేశ్ ఓల్డ్ బోయిన్‌పల్లి సమతానగర్‌లో ఎస్ఏఆర్ఎన్ అసోసియేట్స్ పేరిట ఓ సంస్థను నిర్వహిస్తున్నాడు. నాగర్ కర్నూల్ జిల్లా బోదల్‌కు చెందిన చందు (23) గతేడాది జూన్‌లో రాకేశ్ వద్ద డ్రైవర్‌గా చేరాడు. తాను వివిధ సంస్థల ద్వారా లోన్‌లు ఇప్పిస్తానని చెప్పిన రాకేశ్, చందుకు సైతం లోన్ ఇప్పిస్తానని నమ్మించాడు. రూ.15 లక్షల లోన్ కోసం.. ఆదాయ పన్ను, జీఎస్‌టీ, దరఖాస్తు రుసుము తదితర సాకులతో చందు నుంచి దశలవారీగా రూ.5 లక్షలు వసూలు చేశాడు. తాజాగాలోన్ కోసం చందు ఒత్తిడి చేయగా లోన్ దరఖాస్తు తిరస్కరణకు గురైందని సమాధానమిచ్చాడు. ఎనిమిది నెలల తర్వాత డబ్బు తిరిగి ఇస్తానని చెప్పడంతో బాధితుడికి అనుమానం వచ్చి రాకేశ్ గత చరిత్రపై ఆరాతీశాడు. రాకేశ్ గతంలో తన మాదిరిగానే పలువురుని మోసం చేసినట్లు తెలియడంతో రాకేశ్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడ్‌ను పట్టించుకోని కంటోన్మెంట్ నేతలు

- ఓ వైపు బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు..
- మరో వైపు బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు
- సీఈఓ లేఖ రాసినా స్పందించని పోలీసులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయం, సహకార లోపంతో ఎన్నికల ప్రక్రియ ఓ ప్రహసనంగా సాగుతోంది. కంటోన్మెంట్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 15 రోజులు అవుతున్నా యథేచ్ఛగా ఉల్లంఘనలు సాగుతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులుపెద్ద ఎత్తున కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఓ పక్క బీజేపీ నేతలు స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తుండగా, బీఆర్ఎస్ నేతలు గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవు. గురువారమే పలు చోట్ల ధర్నాలు జరగ్గా బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన శుక్రవారం జేబీఎస్ చౌరస్తాలో ఓ రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరగనున్నట్లు తెలిసిందని, కోడ్ అమల్లో ఉన్నందున అనుమతి లేని ధర్నాను నిలువరించాల్సిందిగా పోలీసు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అయినప్పటికీ పోలీసులు ధర్నాను అడ్డుకోవడం మానేసి, బందో బస్తు కల్పించడం విమర్శలకు తావిస్తోంది. ఏకంగా రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తన కాన్వాయ్‌తో సహా రాస్తారోకోలో పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ సంబంధిత కార్యక్రమాల్లో అధికారిక వాహనాల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

సీఈఓ లేఖలో ఏం చెప్పారంటే...

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కంటోన్మెంట్ సీఈఓ గురువారమే పోలీసు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఏప్రిల్ 30న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా గత నెల 22న కేంద్రం గెజిట్ విడుదల చేసిందని లేఖలో పేర్కొన్నారు. ఈ పాటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశామని, ఆ రోజు నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో జూబ్లీ బస్ స్టేషన్ ఆవరణలో ఓ రాజకీయ పార్టీ నిరసన ప్రదర్శన చేయనున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. సీఈఓ లేఖను ఏమాత్రం పట్టించుకోని పోలీసులు ధర్నాకు దగ్గరుండి మరీ సంపూర్ణ సహకారం అందించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపు సమన్వయ సమావేశం

కంటోన్మెంట్‌లో ఎన్నికల కోడ్ అమలు విషయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయ లేమి నెలకొన్న నేపథ్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. శనివారం నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించనున్నారు.

వినికిడి లోపాలను గుర్తిస్తే నివారణ సులభం

గాంధీఆస్పత్రి : ప్రాథమికదశలో వినికిడి లోపాలను గుర్తిస్తే నివారణ సులభమని గాంధీ ఈఎన్‌టీ విభాగాధిపతి, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు అన్నారు. ప్రపంచ హియరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శోభన్ బాబు మాట్లాడుతు వినికిడిలోపంతో పుట్టిన చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్‌తో సరిచేయవచ్చని, ఈ రకమైన శస్త్రచికిత్సలు గాంధీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. వినికిడి లోపం సమస్యలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించి వైద్య విద్యార్థులు, పీజీలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు జేబీఎస్ రాథోడ్, రంగనాథస్వామి పాల్గొన్నారు.


హియరింగ్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ ఈఎన్‌టీ వైద్యులు, పీజీలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

పద్మారావునగర్: సికింద్రాబాద్ ఓల్డ్‌గాస్‌మండిలో శుక్రవారం ఉప్పలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేడుకల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మన సంప్రదాయాలు, సంస్కృతిని భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, తలసాని సాయికిరణ్ యాదవ్, తలసాని స్కైలాబ్ యాదవ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

అడ్డగుట్ట: స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం నార్త్‌లాలాగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి చొరవతో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల రాజు, అమర్ బన్సోడే, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్త జీవితం అందిస్తున్న ‘ఆశ్రయ్ ఆకృతి’


బాధితులతో ముఖ్య అతిథి సోనాలి దేశ్‌పాండే,ఆశ్రయ్ సంస్థ నిర్వాహకులు

అమీర్‌పేట: వినికిడి లోపం ఉన్న చాలా మంది పిల్లలకు ఆశ్రయ్ ఆకృతి సంస్థ కొత్త జీవితాన్ని అందిస్తోందని పెర్సిస్టెంట్ ఫౌండేషన్ ఛీఫ్ ట్రస్టీ, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ చైర్‌పర్సన్ సోనాలి దేశ్‌పాండే అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌లోని ది ప్లాజా హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినికిడి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. బాధితులను చేరదీసి కావాల్సిన పరికరాలను అందించేందుకు కృషి చేస్తున్న ఆశ్రయ్ ఆకృతి సంస్థను అభినందించారు. సంస్థ వ్యవస్థాపకులు,డైరెక్టర్ డిపికె బాబు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండండి

రాంగోపాల్‌పేట్: రోడ్లపై వెళ్లేటపుడు వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలని జీహెచ్ఎంసీ డీఈ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం రెజిమెంటల్‌బజార్‌లోని నంబర్ వన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుక్కలు ఉన్న ప్రాంతం నుంచి వేగంగా పరుగెత్తడం, వేగంగా వాహనాలు నడపడం మంచిదికాదని చెప్పారు. అవి పరుగెత్తుకుంటూ వచ్చినా కదలకుండా నిల్చుండాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు శ్రీనివాస్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాగునీటి సమస్య పరిష్కరించండి


జలమండలి జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న వల్లారపు శ్రీనివాస్

బౌద్ధనగర్: అంబర్ నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ జలమండలి జీఎంను కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నేతలతో మారేడుపల్లి జలమండలి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. తాగునీటి, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కనులపండువగా సీతారాముల కల్యాణోత్సవం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలకు పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేణుగోపాలరావు పాల్గొన్నారు.


సీతారాముల కళ్యాణోత్సవ దృశ్యం

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


సైన్సు ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

రాంగోపాల్‌పేట్: బేగంపేటలోని డాన్‌బడ్స్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ అంశాల్లో తయారుచేసిన ఎగ్జిబిట్లు ఆలోచింపచేశాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూసీకి పూర్వవైభవం తేవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మూసినదిని శుద్ధిచేసి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో మూసి ప్రక్షాళన పోరాట సమితి ఆధ్వర్యంలో మూసి ప్రక్షాళన –పరిష్కార మార్గాలు–భవిష్యత్తు కర్తవ్యాలు అనే అంశం పై సదస్సు జరిగింది. మాజీ ఐపీఎస్ అధికారి ఆకునూరి మురళి, ఓయూ ప్రొ.వెంకటదాస్ పాల్గొన్నారు.


ఓయూలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

రోడ్డు భద్రత పై అవగాహన


మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఏఎంఎస్ కాలేజీలో రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం కాలేజీలోని ఎంవీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి బేగంపేట్ టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరై రోడ్డు భద్రత, ఇతర అంశాల పై అనేక విషయాలను తెలియచేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ కురుణదేవి పాల్గొన్నారు.